క్లుప్తంగా

మున్సిపల్ చైర్మన్‌కు సన్మానం

మహబూబ్‌నగర్ రూరల్: మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న ఆనంద్‌కుమార్‌గౌడ్‌ను ఎమ్మార్పీఎస్ (టీఎస్) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శుక్రవారం పట్టణంలో ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల కృష్ణ, నాయకులు ఆయనను కలిశారు.

రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్‌కు..

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా గురువారం పదవీబాధ్యతలు చేపట్టిన సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీని జిల్లాకు చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షుడు లింగంనాయక్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అవేజ్ అహ్మద్, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

రెగ్యులర్ చేయాలని మంత్రికి వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ మంత్రికి సమస్యను వివరించారు. ఈమేరకు మంత్రి స్పందిస్తూ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో రామ్మోహన్, బుర్రన్న తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

చిన్నచింతకుంట: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ శేఖర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఓన్‌ప్లేట్ వాహనాలపై చర్యలు తీసుకోవాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ శాఖల్లో అధికారులకు నడిచే ఓన్‌ప్లేట్ వాహనాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఫోర్ వీలర్స్‌డ్రైవర్స్ హైర్ వెహికిల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ కోరారు. గురువారం ఆర్‌టీఓకు వినతి పత్రం సమర్పించారు. అద్దె వాహనదారులు ఉపాధి కోల్పోవలసి వస్తుందని అన్నారు. అనంతరం శాలువాతో సన్మానించారు. దస్తగిరి, శ్రీనివాస్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపుల సీజ్



చిన్నచింతకుంట: గోప్యానాయక్ తండాకు చెందిన వాల్యానాయక్ మన్నెవు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలించి గ్రామ సమీపంలో డంప్ చేశాడు. కాగా గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో తహసీల్దార్ సి.కృష్ణయ్య, ఎస్ఐ శేఖర్ గురువారం డంపులను పరిశీలించి సీజ్ చేశారు. అనంతరం వాల్యానాయక్‌పై కేసునమోదు చేసినట్లు వివరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మహమ్మదాబాద్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గండేడ్ పరిధిలోని రంగారెడ్డిపల్లి వాగు నుంచి గురువారం తెల్లవారుజామున శంకర్ అనే వ్యక్తి తన ట్రాక్టర్‌తో సల్కర్‌పేట్‌కు ఇసుక తరలిస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలో అక్కడికి వెళ్లిన పోలీసులు ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

కార్నర్ మీటింగ్ జయప్రదం చేయండి

జడ్చర్ల టౌన్: విజయ సంకల్పయాత్రలో భాగంగా శుక్రవారం పట్టణంలోని నేతాజీ చౌరస్తాలో నిర్వహించే బీజేపీ కార్నర్ మీటింగ్‌కు అధిక సంఖ్యలో హాజరు కావాలని మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ పిలుపునిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాత్రకు బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ మంత్రి డీకే అరుణ, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్‌లు హాజరవుతారన్నారు.

గిర్దావర్‌కు గాయాలు

అడ్డాకుల: జానంపేట శివారులోని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మూసాపేట గిర్దావర్ రవికుమార్‌కు గాయాలయ్యాయి. తమిళనాడుకు చెందిన నమ్మకోడి 30 ఏళ్ల కిందట మూసాపేటలో తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. గురువారం జానంపేట పంపు వద్ద స్కూటీలో పెట్రోల్ పోయించుకుని వైపు రాంగ్‌రూట్లో వెళ్తున్నాడు. అదే సమయంలో మహబూబ్‌నగర్ నుంచి గిర్దావర్ డ్యూటీకి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. గిర్దావర్ కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. జానంపేట పీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయించారు. నమ్మకోడిని ఎల్అండ్‌టీ అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఎస్ఐ కె.సుజాత ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గిర్దావర్‌ను తహసీల్దార్ బ్రహ్మంగౌడ్ పరామర్శించారు. తర్వాత మహబూబ్‌నగర్‌కు తీసుకెళ్లారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

కంకరపరిచి వదిలేశారు

- ఇప్పటికీ పూర్తికాని రోడ్డు పనులు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణం



ముత్యాలంపల్లి, కప్పెట వెళ్లే దారిలో కంకర వేసి వదిలేసిన రోడ్డు

భూత్పూర్: అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఏడాది క్రితం పూర్తి కావాల్సిన బీటీ రోడ్డు పనులు నేటికీ పూర్తి కాకపోవడం.. కంకర పరిచి వదిలేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మరీ ముఖ్యంగా పోతులమడుగు, ముత్యాలంపల్లి, కప్పెట గ్రామస్తులు, రైతులు కంకర రోడ్డుపై వెళ్లలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన ద్వారా మండలంలోని పోతులమడుగు స్టేజీ ఎన్‌హెచ్–44 నుంచి ఖిల్లాఘణపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు దాదాపు 6.95 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి గాను రూ.459.70 లక్షలు, కప్పెట వద్ద ఉన్న బ్రిడ్జి నిర్మాణానికి గాను రూ. 300.00 లక్షలు, పోతులమడుగు సమీపంలో నిర్మించే బ్రిడ్జికి రూ.250.00 లక్షలు మంజూరు చేశారు. పోతులమడుగు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి , కప్పెట వద్ద నిర్మించే బ్రిడ్జికి 2022 ప్రారంభంలోనే అప్పటి ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. 2023 జనవరికి పనులు పూర్తి చేయాల్సి కావాల్సి ఉన్నా ఇప్పటికీ అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కొనసా...గుతున్న పనులు

పోతులమడుగు సమీపంలోని ముత్యాలంపల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా కొంతమేర పనులు చేయాల్సి ఉంది. కప్పెట సమీపంలోని మరో బ్రిడ్జి నిర్మాణం పనులు నేటికీ కొనసాగుతున్నాయి. పోతులమడుగు జాతీయ రహదారి నుంచి ఖిల్లాఘణపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు కాంట్రాక్టర్ కంకర వేసి వదిలేశారు. వాహనాలు నడవడంతో కంకర సైతం దుస్తుగా మారింది. కప్పెట వద్ద ఉన్న చెరువు కట్ట వద్ద కంకర సైతం వేయకుండా వదిలివేయడంతో వాహనాలు వెళ్లలేని స్థితి ఏర్పడింది. పెద్ద పెద్ద గుంతలతో ప్రమాదాల బారినపడుతున్నారు. వర్షాకాలంలో ముత్యాలంపల్లి, కప్పెట వెళ్లే గ్రామస్తులకు తీవ్రంగా సమస్యలు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులపై ఒత్తిడి తెచ్చి బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వాహనాలు రావడం లేదు



ఆపద ఉన్నప్పుడు 108 వాహనానికి ఫోన్ చేస్తే రహదారి బాగా లేదని గ్రామానికి రావడం లేదు. ఆటో డ్రైవర్లు సైతం అదే చెబుతున్నారు. ఆరోగ్య సమస్యలు ఉంటే స్వంత మోటర్ సైకిల్‌పై తీసుకెళ్లాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. అధికారులు శ్రద్ధ తీసుకొని తొందరగా రోడ్డు వేసేలా చేయాలి

– పాల రాములు, ముత్యాలంపల్లి

ప్రమాదాలు జరుగుతున్నాయి



రోడ్డుపై కంకర వేసి వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వ్యవసాయ పొలాల వద్దకు మోటర్ సైకిల్‌పై రాత్రిళ్లు వెళ్తుండటంతో పాటు... పాల క్యాన్‌లు ఉండటంతో అదుపుతప్పి కిందపడుతున్నారు. మూడేళ్ల నుంచి ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా పూర్తిచేయాలి.

–ఆశన్న, రైతు, కప్పెట

కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇస్తాం

కంకర వేసి వదిలేసిన విషయం వాస్తవమే. బ్రిడ్జి పనులను పూర్తి చేశారు. బిల్లులు రావడం లేదని మిగతా వాటిని కాంట్రాక్టర్ వదిలేశారు. బీటీ రోడ్డు వేయాలని కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తాం. నోటీసులు జారీ చేస్తాం. పనులు చేపట్టకపోతే మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిస్తాం.

– సత్యకృష్ణ, ఏఈ, మహబూబ్‌నగర్

కేసీఆర్ వల్లే తెలంగాణలో అభివృద్ధి



ఆలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నవాబుపేట: కేసీఆర్ ముందు చూపుతోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. కాని తాజాగా వచ్చిన ప్రభుత్వం ప్రతిపక్షాలను విమర్శించటమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు.

గురువారం వీర్‌శెట్టిపల్లిలో నూతన హనుమాన్ ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయానికి ఎంపీ రూ. 1.50 లక్షలు, మాజీ ఎమ్మెల్యే రూ. లక్ష అందించారు. కేసీఆర్ చేపట్టిన అనేక పథకాలు పల్లెలకు కొత్త వెలుగులు తెచ్చాయన్నారు. ఎంపీ ఎన్నికలలో ప్రజలు అధికార పార్టీకి గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, విండో చైర్మన్ నర్సింహులు, ఎంపీపీ అనంతయ్య, కోఆప్షన్ తాహేర్, మధుసూదన్‌రెడ్డి, చెన్నయ్య, ప్రతాప్, వినోద్‌రావు, రాములు, శ్రీనివాస్, రాజునాయక్ తదితరులు ఉన్నారు.

సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



రుసుంపల్లిలో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండేడ్: కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని.. హామీలు, పనులతోనే ప్రజల్లోకి వెళ్తామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం రుసుంపల్లి, చిన్నవార్వాల్, పెద్దవార్వాల్, జక్లపల్లి, చెన్నాయపల్లి తండాల్లో రోడ్డు పనులు ప్రారంభించారు. గ్రామాల్లో అంతర్గత అభివృద్ధితో పాటు పరిగి– కృష్ణ రైల్వేలైన్, నేవీరాడార్ కేంద్రం, చేవెళ్లప్రాణహిత పున:ప్రారంభం, పాలమూరు ఎత్తిపోతల లాంటి పథకాలకు పెద్దపీట వేస్తున్నట్లు వివరించారు. వైస్‌ఎంపీపీ ఈశ్వర్‌గౌడ్, ఎంపీడీఓ దేవన్న, తహసీల్దార్ నాగలక్ష్మి, నర్సింహారావు, పార్టీ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, ప్రభాకర్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షణకు చర్యలు తీసుకోండి



నర్సరీలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ దేవన్న

మహమ్మదాబాద్: నర్సరీల్లో మొక్కలు వేసవి వల్ల ఎండిపోయే ప్రమాదం ఉన్నందున వాటి సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ దేవన్న సూచించారు. గురువారం గాధిర్యాల్, గువ్వోనికుంటతండా, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లో నర్సరీలను, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పనుల రికార్డులను క్రమం తప్పకుండా రాయాలని.. జాగ్రత్తంగా ఉంచుకోవాలని తెలిపారు. పంచాయతీల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయించాలని వివరించారు. ఏపీఓ హరిచ్చంద్రుడు, గ్రామ కార్యదర్శి హాజీ, ఫీల్డ్‌అసిస్టెంట్ లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కేంద్రంలో మళ్లీ మోదీ సర్కారే



హన్వాడలో మాట్లాడుతున్న మిథున్‌రెడ్డి

హన్వాడ: కేంద్రంలో మళ్లీ వచ్చేది మోదీ ప్రభుత్వమేనని బీజేపీ రాష్ట్ర నాయకుడు మిథున్‌రెడ్డి అన్నారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా గురువారం హన్వాడలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మళ్లీ 400 సీట్ల మెజార్టీతో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాబోతున్నదని తెలిపారు. పాలమూరు ప్రజలు సైతం ఎంపీని అధిక మెజార్టీతో గెలిపించి మోదీకి కానుక ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి, శాంతికుమార్, పద్మజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీవర్ధన్, మండల అధ్యక్షుడు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటాం

జడ్చర్ల: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే సి. లక్ష్మారెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని బూరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త హరికృష్ణ రోడ్డు ప్రమాదంలో మరణించగా.. పార్టీ సభ్యత్వం ఉండడంతో రూ. 2లక్షల బీమా చెక్కు విడుదలైంది. ఈమేరకు చెక్కును గురువారం హరికృష్ణ తండ్రి చెన్నయ్యకు మాజీ ఎమ్మెల్యే అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు రేణుక, ప్రణీల్, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

జడ్చర్ల: మారుతి నగర్‌కు చెందిన సిద్దాయపల్లి అమృత(40) కనిపించకుండా పోయిందని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు..ఈనెల 19న భర్త యాదయ్య పొలం దగ్గరకు వెళ్లి వచ్చేసరికి అమృత ఇంట్లోంచి ఎక్కడికో వెళ్లిపోయింది. చుట్టుపక్కలా, బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

యువతి ..

స్థానిక వెంకటేశ్వర కాలనీకి చెందిన గంజికుంట్ల మహేశ్వరి(23) ఈనెల 21 నుండి కనిపించకుండా పోయింది. దీంతో ఆమె తండ్రి సిద్ధయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

కొనసాగుతున్న నారసింహుడి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



పూజల్లో పాల్గొన్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం కొత్తగంజ్ సింహగిరిలోని లక్ష్మీనృసింహస్వామి 37వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం 5.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సుప్రభాత నిత్యోత్సవాలు, చతుస్థానార్చనలు, మూల మంత్ర హవనములు, పూర్ణాహుతి , శేష వాహన సేవ, బలిహరణం, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సాయమారాధన, హనుమత్ వాహన సేవ, హంసవాహన సేవ, చతుస్థానార్చనలు, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ఎదుర్కోళ్లు సాంప్రదాయ బద్ధంగా జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమౌళిగుప్త, ధర్మకర్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి


చిన్నచింతకుంట: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి ఉత్తమ ఫలితాల సాధించేందుకు కృషిచేయాలని డీఈఓ రవీందర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం మండలంలోని కస్తూర్బా, లాల్‌కోట, ఉంధ్యాల, వడ్డేమాన్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఎంఓ శ్రీనివాసులు, సీఎంఓ బాలు యాదవ్, జీహెచ్ఎం మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

కిడ్నాపర్లు వచ్చారంటూ వదంతులు

- మూసాపేట ఎస్సీ హాస్టల్ వద్ద కలకలం
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు
- వదంతులు నమ్మవద్దన్న ఎస్ఐ

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ వద్ద బుధవారం అర్ధరాత్రి చిన్న పిల్లల కిడ్నాపర్లు వచ్చారంటూ విద్యార్థులు ఆందోళనకు గురైన ఘటన కలకలం రేపింది. హాస్టల్‌లో నిద్రిస్తున్న కొందరు విద్యార్థులు అర్ధరాత్రి తర్వాత బాత్‌రూం కోసం లేచారు. వారికి హాస్టల్ పరిసరాల్లో గుర్తు తెలియని వ్యక్తులు కనిపించినట్లు, పిల్లలను పిలిచినట్లు శబ్దాలు రావడంతో భయపడ్డారు. స్థానికులకు సమాచారం ఇవ్వడంతో చుట్టు పక్కల వారు అక్కడికి వెళ్లారు. ఈలోగా సమాచారం అందుకున్న ఎస్ఐ కె.సుజత హాస్టల్ వద్దకు వెళ్లి పరిశీలించారు. చుట్టు పక్కల వెతికినా ఎవరూ కనిపించలేదు. గురువారం ఉదయం వార్డన్ తారాబాయి, డీడీ పాండులు హాస్టల్ వద్దకు వచ్చి విద్యార్థులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఇదిలా ఉండగా గత ఆదివారం మూసాపేటలోని కుమ్మరివాడలో రేషన్ బియ్యం కోసం వచ్చామంటూ పిల్లలను పట్టుకోవడానికి వచ్చిన దుండగులను స్థానికులు పట్టుకునే ప్రయత్నం చేసేలోపు వారు పారిపోవడం అప్పట్లో కలకలం రేపింది. తాజాగా హాస్టల్ వద్ద జరిగిన ఘటన పిల్లల తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తోంది. దీనిపై ఎస్ఐ కె.సుజాత మాట్లాడుతూ పిల్లలను ఎత్తుకెళ్లే వారు వస్తున్నారన్న వదంతులను ఎవరు నమ్మవద్దని కోరారు. ఎవరైనా అనుమానితులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎవరు అనవసర భయభ్రాంతులకు గురికావొద్దని తెలిపారు.

బకాయిలు విడుదల చేయాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ మేరకు కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సతీష్ మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను మర్చిపోయిందని, ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా ఇప్పటికి విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. బడ్జెట్‌లో కనీసం 30శాతం నిధులు కేటాయించాల్సిన ప్రభుత్వం ఏడు శాతం మాత్రమే నిధులు కేటాయించారన్నారు. వెంటనే ప్రభుత్వ విద్యాసంస్థల్లో వసతులు కల్పించి, హాస్టల్‌లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, లేకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. శివ, బలరాం , శివరాం, మహేష్, అక్షయ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఫస్ట్‌ఎయిడ్, సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమ కోఆర్డినేటర్ రమణ హాజరై శిక్షణ ఇచ్చారు. అధిక, అల్ప రక్తపోటు వచ్చినప్పుడు హార్ట్‌ఎటాక్ వస్తుందని అటువంటప్పుడు సీపీఆర్ చేస్తే వ్యక్తులను కాపాండేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. లయన్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధనతో మెరుగైన ఫలితాలు



మహబూబ్‌నగర్ క్రీడలు: నిరంతర సాధనతో క్రీడల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు బి.శాంతికుమార్ అన్నారు. సూర్యాపేట జిల్లా మల్లారెడ్డిగూడెంలో ఇటీవలే జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో మూడోస్థానంలో నిలిచిన బాలుర జట్టును గురువారం జిల్లా కేంద్రంలో శాంతికుమార్ అభినందించారు. జిల్లా సంఘానికి కురుమూర్తిగౌడ్ కార్యదర్శిగా ఉండి మంచి ఫలితాలు సాధించడంలో సఫలీకృతమవుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ సంఘం చైర్మన్ కేబీ.శ్రీరాములు, కార్యదర్శి కురుమూర్తిగౌడ్, అభినందనీయమన్నారు. కార్యనిర్వాహక కార్యదర్శి రాజవర్ధన్‌రెడ్డి, కోచ్ మల్లేష్, గణేష్ పాల్గొన్నారు.

వెంకన్న సేవకు వేళాయె



జడ్చర్ల వేంకటేశ్వరస్వామి

గండేడ్: జంగంరెడ్డిపల్లి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి 26 వరకు కొనసాగనున్నాయి. శుక్రవారం శకటోత్సవం, ఎదుర్కోళ్లు, ప్రభోత్సవం, 24న మంగళవాయిద్యం, ప్రత్యేకపూజ బాలభోగం, 11.45 గంటలకు స్వామి వారి కళ్యాణోత్సవం, రాత్రికి రథోత్సవం, 25న మంగళవాయిద్యం, ప్రత్యేకపూజ, దీపోత్సవం, 26న బాలభోగం, వసంతోత్సవం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి రానున్నట్లు వివరించారు. అదేవిధంగా

వెన్నాచేడ్‌లో..లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఉత్సవాలు శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం పల్లకీసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. 24న ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, అభిషేకం, అష్టోత్తరం, అలంకరణ, 11.30 నిమిషాలకు కల్యాణోత్సవం, మంత్రపుష్పం ఆశీర్వచన, తీర్థప్రసాద వితరణ , 25న ఉదయం 5గంటలకు రథోత్సవం, సత్యనారాయణ స్వామి వ్రతం, మహామంగళ హారతి తీర్థప్రసాదాల వితరణ ఉంటుందన్నారు.

మహమ్మదాబాద్: నంచర్ల లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 23న స్వామివారి అభిషేకం, మూలవిరాట్ హోమం, మహామంగళహారతి, 24న స్వామివారి అభిషేకం, పల్లకీసేవ, కల్యాణోత్సవం, అన్నదానం, శకటోత్సవం ఉంటాయని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

ప్రారంభమైన వేడుకలు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రసిద్ధిగాంచిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, అలంకరణ సేవలు నిర్వహించారు. స్వామికి వెండి తొడుగును అలంకరించారు. సాయంత్రం గణపతిపూజ, పుణ్యాహవాచనం, కంకణపూజ, అంకురార్పణం, గోపూజ, ప్రదోషపూజలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తిచేశారు.

దేవరకద్ర పూజారికి ప్రశంసాపత్రం



దేవరకద్ర: మండల కేంద్రంలో ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు నాగరాజు స్వామి గురువారం శ్రీశైలంలో ప్రశంసా పత్రం అందుకున్నారు. శివాజీ గోపుర కలశ ప్రతిష్ఠాపనతో పాటు మహా కుంభాభిషేకం మహోత్సవంలో నాగరాజుస్వామి పాల్గొన్నారు. ఈ మేరకు ప్రశంసా పత్రం అందజేశారు.

బీసీలను విస్మరిస్తే మూల్యం తప్పదు



దేవరకద్ర: మహబూబ్‌నగర్ పార్లమెంట్ టికెట్‌ను అన్ని రాజకీయ పార్టీలు బీసీలకే కేటాయించాలని బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం దేవరకద్ర ఆటో స్టాండ్ వద్ద వాల్‌పోస్టర్లు విడుదల చేసి మాట్లాడారు. 65 శాతంకు పైగా బీసీ ఓటర్లే ఉన్నారని... విస్మరిస్తే భారీ మూల్యం తప్పదని హెచ్చరించారు. ఇప్పటికే కాంగ్రెస్ నుంచి రెడ్డి సామాజిక వర్గానికి టికెట్ కేటాయించి సీఎం బీసీ వ్యతిరేకతను చాటుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీలైనా బీసీ అభ్యర్థులకు సీటును కేటాయించాలని కోరారు. రాజు, నర్సిములు, రాజు, చెన్నయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

రాజాపూర్: సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లి గ్రామస్తులు అన్నారు. గురువారం విద్యా కమిటీ చైర్మన్ బాల్‌చెన్నయ్యతో పాటు గ్రామస్తులు కోస్గివెంకటయ్య, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాఠశాల వద్దకు వెళ్లారు. ఆరుగురు ఉపాధ్యాయులకుగానూ ముగ్గురు మాత్రమే ఉన్నారని... మిగతావారు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా.. కనీసం లీవ్ లేటర్‌కూడా ఇవ్వకుండ వెళ్లారని ఆరోపించారు. పైగా మధ్యాహ్నం వరకు విధుల్లో ఉన్నట్లు హాజరు రిజిస్టర్‌లో సంతకాలు చేసివెళ్లినట్లు పేర్కొన్నారు. గతంలో కూడా గ్రామస్తులు అందరు కలిసి పద్ధతి మార్చుకోవాలని.. సమయపాలన పాటించాలని కోరినా ఎలాంటి ఫలితం కనిపించడం లేదన్నారు. ఇష్టానుసారంగా పాఠశాలకు వస్తున్నా సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సదరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

బోగస్ పట్టాదారులపై చర్యలు తీసుకోండి



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఉదయ్ సంఘం నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: క్రిష్టియన్‌పల్లి పరిధిలోని ఆదర్శనగర్ 523 సర్వేనంబర్‌లో దివ్యాంగులకు కేటాయించిన భూమిలో అక్రమ కట్టడాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా... రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఉదయ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల కాలనీలో గతంలో ఒక్కో లబ్ధిదారుడికి 75 గజాల చొప్పున 85 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అందులోనూ కొంత మంది బోగస్ పట్టాలు సృష్టించారన్నారు. గతంలో పనిచేసిన తహసీల్దార్‌ల సంతకాలను సైతం ఫోర్జరీ చేసి పట్టాలను సృష్టించుకుని అక్రమంగా ఇళ్లు కూడా నిర్మించుకుంటున్నారని పేర్కొన్నారు. కాగా ఎమ్మెల్యే విచారణ జరిపించి అర్హులైన వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. నాగరాజు, బి.రాజు, అంజయ్య, మంగలి రమేష్ తదితరులు ఉన్నారు.